

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 28-10-2025 సంపుటి : 07 సంచిక : 167 పేజీలు : 8 వెల : రూ 3-00

## తుపాను తీరప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలి.. మంత్రి లోకేష్ కీలక ఆదేశాలు



అమరావతి, అక్టోబరు27 : మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు మంత్రి నారా లోకేష్.ప్రస్తుత సమాచారం ప్రకారం కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఆ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలని సూచించారు. అవసరమైతే కూటమి పార్టీలకు చెందిన కేడర్ ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆజ్ఞాపించారు. తుపాను ప్రభావిత తీరప్రాంతాలు, లంక గ్రామాల్లోని ప్రజల కోసం ముందస్తుగా సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఆయా శిబిరాల్లోని నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు మంత్రి నారా లోకేష్. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అంటురోగాలు ప్రబలకుండా వైద్యా, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర వైద్యసేవల కోసం అంబులెన్స్‌లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఆ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆజ్ఞాపించారు. కమ్యూనికేషన్ సమస్యలు తలెత్తకుండా సెల్‌ఫోన్ ఆపరేటర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు మంత్రి నారా లోకేష్.భారీవర్షాల కారణంగా చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పంటపొలాల్లో నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున ఆయిల్ మోటార్లు సిద్ధంగా ఉంచుకోవాలని మార్గనిర్దేశం చేశారు. మొంథా తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను బాధితులకు ఎలాంటి సాయం అవసరమైన వెంటనే స్పందించేందుకు యంత్రాంగం 24 గంటలు సిద్ధంగా ఉండాలని మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు.

## రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్



అమరావతి , అక్టోబరు27 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏపీలోని రైల్వే ప్రాజెక్టుల పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే రైల్వే ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రైల్వే శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే ప్రాజెక్టులపై సంబంధిత అధికారులకి కీలక సూచనలు చేశారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి తక్షణం చేపట్టాల్సిన చర్యలు, రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు సీఎం చంద్రబాబు.నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్, గుణదల, ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్ - తుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి రైల్వేశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలని పంపించిందని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం ఏపీలో పురోగతిలో ఉన్న రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు చేపట్టాల్సి ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తి గా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక ప్రక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ కాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు.హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు.

## రెండో దశలో 12 రాష్ట్రాలు, యూటీల్లో ఎస్ఐఆర్.. ఈసీ కీలక ప్రకటన



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది.ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లెవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బీహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు.

## మొంథా తుపాను ఎఫెక్ట్..
### తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు27 : మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి మరో మూడు రోజులు అత్యంత భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మొంథా తుపానుగా మారిందని తెలిపారు. మొంథా తుపాను కాకినాడకి 570 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 600 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృతం అయిందని చెప్పుకొచ్చారు. రేపు(మంగళవారం) ఈ తుపాను ఉత్తర వాయువ్య దిశలో కదిలి తీవ్ర తుపానుగా మారనుందని పేర్కొన్నారు.ఈ తీవ్ర తుపాను మంగళవారం రాత్రి, లేదా ఎల్లుండి(బుధవారం) ఉదయంలోగా మచిలీపట్నం, కళింగపట్నం ఇంచుమించు.. కోస్తా ఆంధ్రప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు.

## పోలీసు (ఓపెన్ హౌస్) ఆయుధాల ప్రదర్శనను పరిశీలించిన జిల్లా ఎస్పీ.



విభారే న్యూస్ అక్టోబర్ 27 కర్నూలు జిల్లా ప్రతినిధి..పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్దులు అవగాహన కల్గి ఉండటం మంచిది.జిల్లా ఎస్పీ.పోలీసులు నిత్యం వినియోగించే ఆయుధాల పై విద్యార్థులకు అవగాహన.పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ ఒపెన్ హౌస్ కార్యక్రమాన్ని పరిశీలించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మాట్లాడుతూఈ కార్యక్రమం ముఖ్యంగా ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, పోలీసుల కష్టసాధ్యమైన విధులను వివరించడమే లక్ష్యంగా నిర్వహించామన్నారు. పోలీసులు తమ నిత్య జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను మరియు వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూడగలిగే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కల్పించామన్నారు.ప్రతీ విభాగం తీరుపై అవగాహన కలిగించడం ద్వారా విద్యార్థుల్లో సమాజ సేవ పట్ల ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశామన్నారు.విద్యార్థులకు ఎఆర్ సిబ్బంది ఆయుధాల వివరాలను తెలియజేస్తున్నారన్నారు.ఆయుధాల వినియోగ విధానాలు,ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధం వాడవలసి ఉంటుందో, ఆ ఆయుధం ఎలా పనిచేస్తుందో సిబ్బంది తెలియజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ , ఆర్ ఐలు పోతలరాజు,జావేద్ , నారాయణ,ఆర్ ఎస్ ఐలు,పోలీసు సిబ్బంది, కర్నూలు నగరంలోని మాంటిస్సోరి స్కూల్ , శ్రీలక్ష్మి స్కూల్, శ్రీ చైతన్య స్కూల్ విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

మంగళవారం 28-10-2025

## వాయుగండాలు

ప్రపంచంలోనే అతి పెద్ద తీరప్రాంతం బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉంది. సుమారు 50 కోట్ల మంది ఈ తీర ప్రాంతంలో నివసిస్తున్నారు. అలాగే ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన తుపానుల్ని ఎదుర్కొంటోంది కూడా ఈ తూర్పు తీర ప్రాంతమే. వాతావరణ వివరాలను అందించే వెబ్ సైట్ వెదర్ అండర్ గ్రౌండ్‌లో ఈ తీరానికి సంబంధించి కొన్ని ఆసక్తికర వివరాలున్నాయి. ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన 35 తుపానుల్లో 27 పెను తుపాన్లు ఈ తీరంలోనే సంభవించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఘోరమైన తుపానులన్నీ బంగాళాఖాతంలోనే సంభవిస్తుంటాయని చెబుతారు వాతావరణ పరిశోధకులు. ఇక్కడ లోతు తక్కువగా ఉంటూ ఒక వైపుకు తీర ప్రాంతం వంగినట్లు ఉండి పల్లంగా ఉంటుంది. సాధారణంగా తుపాను సమయంలో వీచే బలమైన గాలులు నీటిని బలంగా ఒడ్డువైపుకు తోస్తాయి. ఫలితంగా అలల వేగం ఒక్కసారిగా పెరిగి నేరుగా తుపాను తీరాన్ని తాకుతుంది. బంగాళాఖాతం ఉపరితలంలో ఉష్ణోగ్రతలు ఎప్పుడూ అధికంగా ఉండటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణం. ఫలితంగా తీవ్ర తుపానులు సంభవిస్తుంటాయి. "అక్కడ ఉష్ణోగ్రతల స్థాయి చాలా ఎక్కువ" అని భారత వాతావరణ పరిశోధన విభాగ అధిపతి డి. మహాపాత్ర వ్యాఖ్యానించారుప్రపంచవ్యాప్తంగా ఈ తరహా పెను తుపానులు సంభవించే మరికొన్ని తీర ప్రాంతాలు కూడా ఉన్నాయి. అందుకు ఉదాహరణ లూసియానాలోని గల్ఫ్ తీర ప్రాంతం. "కానీ బంగాళాఖాతపు ఉత్తర తీర ప్రాంతంలో తుపానులు ఒక్కసారిగా విరుచుకుపడి పెను నష్టానికి కారణమవుతాయి. భూమిమీద ఇంకెక్కడా ఇంత దారుణమైన పరిస్థితులు తలెత్తవు" అని హెన్సన్ అన్నారు. తూర్పు తీర ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉండటం కూడా తీవ్ర నష్టానికి కారణమవుతోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తీర ప్రాంతాల్లోనే ఉంటున్నారు. తుపానుల వల్ల అనేక విపత్తులు ఎదురవుతాయి. బలమైన గాలుల కారణంగా భౌతిక నష్టం ఎక్కువగా ఉంటుంది. అలాగే సముద్రంలో అలల పోటు తీవ్రంగా ఉంటుంది ఈ రెండింటితో పాటు భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్థం చేస్తాయి. సాధారణంగా బంగాళాఖాతంలోనూ, అరేబియా సముద్రంలో తరచూ తుపానులు వచ్చినా ప్రతి పదేళ్లకు ఒకసారి మాత్రమే ఈ స్థాయి తుపానులు విరుచుకుపడుతుంటాయి. మన భారతదేశ భౌగోళిక స్వరూప దృష్ట్యా మనం ఈ తూఫాన్లను చూస్తూ ఉంటాం. సాధారణంగా ఇవి భూమధ్య రేఖకు 500 కిమీ నుండి 25000 కిమీ ల మధ్య మాత్రమే ఏర్పడతాయి. అందుకే వీటిని మనం ఉష్ణ మండల తూఫాను గా సంబోధిస్తాము. తూఫాను అన్నది సముద్ర జలాల పై ఏర్పడే అల్ప పీడన ప్రాంతమే. కానీ ఇక్కడ కేంద్రం చుట్టూ ఉన్న ఎన్విరాన్మెంట్ కన్నా వెచ్చగా ఉండి అపసవ్య గడియార దిశలో తిరుగుతూ ఉంటుంది. ఇక్కడ నేను అతి తక్కువ శాస్త్రీయ పదాలు ఉపయోగించి అందరికీ అర్థం అయ్యేలా రాయడానికి ప్రయత్నిస్తాను. తూఫాను ఏర్పడడానికి ముందు కచ్చితంగా ఈ క్రింద తెలపడిన అంశాలు ఉండి తీరాలి. ముందుగా సముద్ర ఉపరితల జల ఉష్ణోగ్రత కచ్చితంగా 26.5 డిగ్రీ సెంటిగ్రేడ్ కన్నా ఎక్కువ ఉండాలి. సముద్ర వాతావరణం గా ఉండాలివాతావరణ మధ్య పొరలలో ఎక్కువ ఆర్ద్రత లభించాలి. కరియోలిస్ ఫోర్స్ (ఇది తూఫాను అపసవ్య గడియార దిశలో తిరిగేందుకు)ఒక దృఢమైన వాతావరణ అలజడి (అల్ప పీడన ప్రాంతం)ఎప్పుడైతే పైన తెలుపబడిన అంశాలు వాతావరణం లో లభ్యమవుతాయో అప్పుడు ఒక అల్ప పీడనం తూఫాను గా రూపాంతరం చెందడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ముందుగా వెచ్చని తేమతో కూడిన సముద్ర ఉపరితల గాలులు వాతావరణ పై పొరలలోకి వెళ్ళేటప్పుడు తక్కువ సాంద్రత కలిగిన గాలిని క్రింది వాతావరణ పొరల్లో వదిలేస్తాయి. కాబట్టి అక్కడ అల్ప పీడన ప్రాంతం ఏర్పడుతుంది. ఎప్పుడయతే ఈ అల్ప పీడన ప్రాంతం ఏర్పడిందో, దానికి చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతం లోకి వచ్చి అది కూడా తేమను సంగ్రహించి పై పొరలలో కి వెళ్తుంది. ఈ ప్రక్రియ అలా జరుగుతూ ఉంటుందిఎప్పుడైతే ఈ వెచ్చనైన తేమతో కూడిన గాలి పై పొరలలో చల్లర్చబడినదో, వెంటనే మేఘాలు ఏర్పడుతాయి. ఆ పై సముద్ర ఉష్ణ శక్తి మరియు ఉష్ణ ఎవోపోరేషన్ దోహదపడి, కారియోలిస్ ఫోర్స్ కారణంగా ఈ మేఘాలు అప గడియార దిశలో తిరగడం ప్రారంభిస్తాయి. ఈ మేఘాలు, వాతావరణ అనుకూల స్థితుల దృష్ట్యా మరింత వేగం గా తిరుగుతాయి. ఇలా తిరగడం వలన ఉపరితల గాలుల తీవ్రత అధికంగా ఉంటాయి. ఈ ఉపరితల గాలులు (10ఎ ఎత్తు వద్ద) ఎప్పుడైతే 34 నాట్స్ (1 నాట్ = 0.514 ఎ/బ) చేరతాయో అప్పుడు ఆ వాతావరణ స్థితిని తూఫాను గా ప్రకటిస్తారు. ఈ గాలుల తీవ్రత నిర్దిష్ట పరిమితి దాటిన తర్వాత వాటి యొక్క స్థాయిని వాతావరణ శాఖ వారు వేరు వేరు స్టేజ్ లుగా ప్రకటిస్తారు. ఉష్ణ మండల తూఫాను (34 నుండి 47 నాట్స్ వరకు)తీవ్ర తుఫాను (48 నుండి 63 నాట్స్ వరకు)అతి తీవ్ర తుఫాను (64 నుండి 89 నాట్స్ వరకు)అత్యంత తీవ్ర తుఫాను (90 నుండి 119 నాట్స్ వరకు)మహా తూఫాను (120 నాట్స్ నుండి)ఈ తుఫాను ఎప్పుడైతే భూ భాగం పై కి వస్తుందో (ఈ పక్రియ ను తీరం దాటడం గా అభివర్ణిస్తారు) అప్పుడు ఈ భీకర ఉపరితల గాలులు మరియు అతి భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం కలిగిస్తుంది.

## కోదాడలో పారిశుధ్యం అస్తవ్యస్తం.. పర్యవేక్షణ పట్టని అధికారులు



కోదాడ, అక్టోబర్ 27 : మేజర్ గ్రామ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన కోదాడ పట్టణ పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సందు గొందులలో చెత్త పేరుకుపోయి మురుగు కంపు కొడుతున్నప్పటికీ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైనా లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయా కాలనీలోని ప్రజలు పారిశుధ్యంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం మాత్రం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే పాలన బాగుందని, ఇప్పుడు మాత్రం చెత్త పాలన సాగుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. 65వ జాతీయ రహదారిపై ఉన్న కోదాడ పట్టణం 80 వేల జనాభాతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పరిణామంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కోదాడ పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందినప్పటికీ పాలనలో మాత్రం ఆరడుగుల వెనక్కు వెళ్లిందని పట్టణ ప్రజలు బహిరంగ విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే పట్టణ పారిశుధ్యం బాగా ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మాత్రం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉందని ఏ కాలనీ, వీధులు, సందుల్లో చూసినా చెత్త పేరుకుపోయి మురుగు కంపు కొడుతుందని, పారిశుధ్య లోపంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒకసారి కూడా కాలనీలకు చెత్తను సేకరించే వాహనం దర్శనం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోదాడ మున్సిపాలిటీకి ఏడాదికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంటి పన్నుల రూపంలో తమ ముక్కులు పిండి వసూలు చేస్తున్నప్పటికీ వసతులు మాత్రం శూన్యం అని అంటున్నారు. పాలకవర్గం లేకపోవడంతో అధికారులదే ఇస్తారాజ్యమైంది. పట్టణంలోని రహదారులు గుంతలతో, తేలిన కంకర రాళ్లతో వాహనాలు నడిపే పరిస్థితి లేకుండా పోయింది. ఇక మురికి కాల్వల సంగతి చెప్పనవసరం లేదు. సకాలంలో కాల్వలు శుభ్రం చేయక పోవడంతో వండు పేరుకుపోయి నిల్వ ఉండడంతో కంపు కొడుతున్నాయి. వారానికి ఒకసారైనా మున్సిపల్ ఉన్నతాధికారి కనీస పర్యవేక్షణ లేదని ఈ పరిస్థితిలో సిబ్బంది ఎలా పని చేస్తారనే విమర్శ వినిపిస్తుంది. పట్టణంలో ఓ పక్క కోతులు మరోపక్క పందులు ఇష్టారాజ్యంగా సంచరిస్తున్నప్పటికీ నిలువరించే దుస్థితి లేదు. కుక్కల బెడదతో చిన్నారులు, వృద్ధులు ఆరు బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే చిన్నారులు, పెద్దలు కుక్కల కాటున పడ్డారు. ఇక కోతులు ఇళ్లలో జొరబడి నానా పరేషాన్ చేస్తున్నాయి. వీటిని నిలువరించేందుకు మున్సిపల్ అధికారి కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 24 గంటలు మందలు మందలుగా పశువులు సూర్యాపేట, హుజూర్‌నగర్, ఖమ్మం, విజయవాడ వెళ్లే ప్రధాన రహదారులపై తిష్ట వేస్తున్నప్పటికీ పట్టించుకునే దిక్కు లేదు. పశువుల యజమానులను మందలించే పరిస్థితి లేదు. దీంతో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కోదాడ పట్టణంలో చిన్న వర్షం వస్తే చాలు వీధులన్నీ జలమయమే. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వరద నీరు మోకాళ్ల లోతు వీధుల్లోకి ప్రధాన రహదారి పైకి చేరి పారిశుధ్య లోపానికి కారణం అవుతుంది. కోదాడ పట్టణంలో డ్రైనేజీపై అక్రమ నిర్మాణాలు జరగడంతో ఈ దుస్థితి ఏర్పడింది. చర్యలు తీసుకుందామనే చిత్తశుద్ధి లేదని ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణ సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పని చేయని లిఫ్ట్



కొండాపూర్, అక్టోబర్ 27 : లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన లిఫ్ట్ అప్పుడే మొరాయిస్తుంది. అధికారులను కలిసేందుకు వచ్చే అర్జిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో రూ.29.80 లక్షలతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ మున్నాళ్లకే పాడైపోయింది. హైటెక్ రేంజ్ లో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన లిఫ్ట్ అప్పుడే పాడవడం ఏంటంటూ జీహెచ్ఎంసీ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. సోమవారం ప్రజావాణి కొనసాగుతుండడం, అధిక సంఖ్యలో అర్జీలు పెట్టుకునేందుకు వచ్చిన వారికి ఇబ్బందులు తప్పలేదు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేస్తే సరిపోదు.. సరైన మెయింటెనెన్స్ కూడా ఉండాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ చంద్రభాను



ఇల్లెందు, అక్టోబర్ 27 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. సోమవారం ఇల్లెందు పట్టణం కొత్త కాలనీలో చైతన్యం -డ్రగ్స్ పై యుద్ధంలో భాగంగా ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఇల్లెందు పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకె కాలనీ ఉన్న కొత్త కాలనీలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా వంద ఇండ్లలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను, 10 ఆటోలను వెరిఫై చేసి పంపారు. ఐదు బైకులు సీజ్ చేశారు. అనంతరం కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసిన డీఎస్పీ మాట్లాడారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. అదే విధంగా చైతన్యం పేరుతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా యువత డ్రగ్స్ మహమ్మారిన పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం వెల్లడించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు తాటిపాము సురేశ్, బత్తుల సత్యనారాయణ, ఎల్.రవీందర్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదంలో తల్లీబిడ్డ సజీవదహనం కావడం బాధాకరం : పద్మా దేవేందర్ రెడ్డి

మెదక్ రూరల్ : మెదక్ మండలం శివ్వాయిపల్లి గ్రామానికి చెందిన మంగ సంధ్యారాణి , ఆమె కుమార్తె మంగ చందన ఈ నెల 24న తెల్లవారుజామున కర్నూలు సమీపంలో బస్సు తగులబడిపోయిన ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం అనంతరం వారి మృతదేహాలను కుటుంబసభ్యులు స్వగ్రామానికి చేర్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఎం పద్మా దేవేందర్ రెడ్డి శివ్వాయిపల్లి పల్లి గ్రామానికి చేరుకొని సంధ్యారాణి, చందనల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులు ఆనంద గౌడ్, సిద్ధ గౌడ్‌లను పరామర్శించారు. బస్సు ప్రమాదంలో తల్లీకుమార్తె సజీవ దాహనం కావడం చాలా బాధాకరమని అన్నారు. వారి వెంట మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు కొత్తపల్లి కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, మాజీ సర్పంచ్ మాదవి రవీందర్, పాపన్నపేట్ మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, నాయకులు నరేందర్, విట్టల్ తదితరులు ఉన్నారు.


## కపాస్ కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలి : సీపీఎం

నకిరేకల్, అక్టోబర్ 27 : కపాస్ కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం అలాగే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నకరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో పత్తి చేనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర మహిళ కన్వీనర్ కందాల ప్రమీల మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన కాపాస్ కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలంటే కేంద్రం తీసుకు వచ్చినటువంటి ఈ యాప్ లో రైతు పంట తదితర వివరాలు నమోదు చేయాలని, అలా నమోదు చేసుకోకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేయమనే నిబంధన సరియైనది కాదని విమర్శించారు. జిల్లాలో ప్రతి రైతుకు స్మార్ట్ ఫోన్ లేదని, స్మార్ట్‌ఫోన్ ఉన్నా సరైన అవగాహన, ఇంటర్ నెట్ తదితర ఇబ్బందులు ఉంటాయని కావునా ఈ యాప్ లో నమోదు చేయాలనే నిబంధనతో సంబంధం లేకుండా వ్యవసాయ అధికారి ఇచ్చే టోకన్ ద్వారా పత్తి కొనుగోలు చేసేలా జిల్లా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పత్తి క్వింటాకు రూ.10,075 చెల్లించాలని, పత్తి కొనుగోలు చేసిన 24 గంటల లోపల రైతు అకౌంట్‌లో డబ్బులు జమ చేసేలా చూడాలని ఆమె కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులకు సూచించారు. జిల్లాలో వెంటనే వీలైనన్ని ఎక్కువ చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ప్రైవేట్ పత్తి వ్యాపారం నుండి రైతులను కాపాడి మద్దతు ధర చెల్లించే విధంగా కృషి చేయాలన్నారు. వర్షాల వల్ల తెగుళ్ల వల్ల ఇప్పటికే పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోయారని ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వల్ల పత్తి రంగు మారిందనే సాకుతో ప్రైవేట్ వ్యాపారులు రైతాంగాన్ని దగా చేస్తున్నారన్నారు. కాబట్టి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీసం మద్దతు ధర రూ.10,075/ కచ్చితంగా అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్, పట్టణ కార్యదర్శి వంటేపాక వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు చెన్నబోయిన నాగమణి, ఒంటెపాక కృష్ణ, రైతు సంఘం నాయకురాలు గురిజ స్వరూప పాల్గొన్నారు.




## యూపీఎస్సీ అభ్యర్థి హత్య కేసులో.. లివిన్ పార్ట్నర్‌తో పాటు మరో ఇద్దరి అరెస్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని గాంధీ విహార్ ఏరియాలో యూపీఎస్సీ ప్రిపేరవుతున్న 32 ఏళ్ల అభ్యర్థి అనుమానాస్పద రీతిలో మృతిచెందిన విషయం తెలిసిందే. రాంకేశ్ మీనా అనే వ్యక్తి తన ఫ్లాట్‌లో మంటల్లో కాలి ప్రాణాలు విడిచాడు. అయితే ఈ కేసులో ఢిల్లీ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. అతనితో సహజీవనం చేస్తున్న అమ్మాయితో పాటు మర్డర్‌లో భాగమైన మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ సైన్సులో బీఎస్సీ చదువుతున్న 21 ఏళ్ల అమ్మాయిని, ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్‌ను, అతని స్నేహితుడిని అరెస్టు చేశారు. వీళ్లంతా యూపీలోని మొరాదాబాద్ నివాసితులు. బాధిత వ్యక్తితో యూపీ మహిళ గత కొన్నాళ్ల నుంచి లివిన్ రిలేషన్‌లో ఉన్నది. అయితే మరో ఇద్దరితో కలిసి యూపీఎస్సీ ప్రిపేరవుతున్న మీనా అనే వ్యక్తిని హత్య చేయించింది. ఆ హత్యను అగ్నిప్రమాదంగా చిత్రీకరించేలా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. గాంధీ విహార్ బిల్డింగ్‌లోని నాలుగవ అంతస్తులో రాంకేశ్ మీనా నివాసం ఉంటున్నాడు. అక్టోబర్ 6వ తేదీన ప్రమాదం జరిగినట్లు పోలీసులకు సమాచారం వెల్లింది. ఏసీ బ్లాస్ట్ కావడం వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. అయితే మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఓ కాలిన మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత దర్యాప్తు చేపట్టారు. అయితే అక్టోబర్ 5వ తేదీ రాత్రి సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు సేకరించారు. ముఖానికి బట్ట కట్టుకున్న ఇద్దరు వ్యక్తులు ఆ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఓ అమ్మాయి ఓ వ్యక్తితో బయటకు వెళ్తున్నట్లు గుర్తించారు. వాళ్లు వెళ్లిన కాసేపటికి ఆ ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ అమ్మాయి కాల్ రికార్డులను పరిశీలించారు. క్రైంసీన్‌లో మహిళ ఉన్నట్లు భావించిన పోలీసులు ఆమె కోసం మొరాదాబాద్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్టోబర్ 18వ తేదీన ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసినట్లు ఆ మహిళ అంగీకరించింది. తనకు సహకరించిన ఇద్దరు వ్యక్తుల పేర్లను కూడా వెల్లడించింది. పోలీసుల విచారణలో ఆ అమ్మాయి కొన్ని విషయాలను వెల్లడించింది. తనకు చెందిన కొన్ని అసభ్యకర వీడియోలను మీనా షూట్ చేశాడని, వాటిని డిలీట్ చేసేందుకు నిరాకరించాడని ఆ అమ్మాయి చెప్పింది. ఈ విషయాన్ని తన మాజీ ప్రియుడికి చెప్పిందామె. దీంతో ఆగ్రహానికి గురైన మాజీ ప్రియుడు మీనాను చంపేయాలని డిసైడ్ అయ్యాడు. బాధితుడు మీనాను తొలుత గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత అతనిపై నూనె, నెయ్యి, మద్యం పోశారు. అమ్మాయి మాజీ ప్రియుడు గతంలో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో గ్యాస్ సిలిండర్ వాల్వ్ ఓపెన్ చేసిన అతను.. దానికి నిప్పు అంటుకునేలా చేశాడు. దీంతో ఆ సిలిండర్ పేలింది. బాధితుడికి చెందిన హార్డ్ డిస్క్, ల్యాప్‌టాప్స్, ఇతర వస్తువులతో నిందితులు పరారీ అయ్యారు. నిందితుల నుంచి హార్డ్ డిస్క్, ట్రాలీ బ్యాగ్, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగనున్నది.



# దటీజ్ చంద్రబాబు



విజయవాడ, అక్టోబరు 27 (న్యూస్ పల్స్)10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను

## 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

# కూటమి సర్కార్ లోనూ ఫ్యాన్ నేతలు చక్రం

రాజమండ్రి, అక్టోబరు 27 ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేడు నెలలవుతుంది. అయితే ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నది వైసీపీ నియమించిన వారేనట. ఈ మాటలన్నది ఎవరో కాదు. స్వయానా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రతి జిల్లాలో తన మనుషులను నియమించుకున్నాని, వారే జిల్లాల్లో ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాలోనూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది గత ప్రభుత్వ హయాంలో కొడాలి నాని వద్ద ఉన్న ఒక వ్యక్తి అని, అతనే ఇప్పుడు కేశినేని చిన్ని కార్యాలయంలో కూర్చుని ఈ మాఫియాను నడుపుతున్నారని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు రాష్ట్ర రాజకీయాలపై ఒక అవగాహన ఉందని అంటున్నారు. అందుకే ఆయన చేసిన ఆరోపణలను ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వైసీపీ నేతల మనుషులే రేషన్ బియ్యం మాఫియాను నడుపుతుండటం సిగ్గుచేటని కామెంట్స్ పెడుతున్నారు. వైసీపీ నేతలను అరెస్ట్ చేయాల్సిందిబోయి వారిని అక్కున చేర్చుకోవమేంటని టీడీపీ అభిమానులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రతి జిల్లాలో ఒక మనిషిని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నియమించుకున్నారని, వారి ద్వారా రేషన్ డీలర్ల ను బెదిరించి ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపై ఇప్పుడు జనసేనకు కూడా చుట్టుకుంది. జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలు నాదెండ్లకు ఆగ్రహాన్ని తెప్పించాయి. తాజాగా కొలికపూడి చేసిన వ్యాఖ్యలతో ఆయన మరింత కోపానికి గురయినట్లు తెలిసింది. మొత్తం మీద కూటమిలో ఇప్పటికీ వైసీపీ నేతల హవా నడుస్తుందన్న కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో మంటలు రేపుతున్నాయి. చంద్రబాబు వచ్చిన తర్వాత దీనికి ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు.

# కాకినాడ నుంచి నక్కపల్లికి బల్క్ డ్రగ్స్

విజయనగరం, అక్టోబరు 27 మన దేశ ఔషధ రంగ భవిష్యత్‌ను పూర్తిగా మార్చే సత్తా ఉన్న మెగా ప్రాజెక్టు ఈ బల్క్‌డ్రగ్ పార్క్. కరోనా సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కోవిడ్ టైంలో అసలు మాస్క్‌లను కూడా భారీగా ఉత్పత్తి చేయలేని మన వైద్యరంగం ఉండేది. భవిష్యత్‌లో వైద్యపరంగా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా దేశంలో అతి పెద్ద బల్క్‌డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని భావించింది. దీని కోసం దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ మూడు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు నచ్చిన కేంద్రం వారికి ఆ అవకాశం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో ఈ డ్రగ్‌పార్క్‌లు ఏర్పాటుకు అంగీకరించింది. ఏడాదిన్నర లోపు ఈ డ్రగ్ పార్క్ మొదటి విడత ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవాంతరాలు కారణంగా ఇప్పటి అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయింది. ఈ ప్రాజెక్టు చేజారిపోకుండా వచ్చే మార్చి నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ప్రభుత్వం ఫైనల్ గడువు ఇచ్చి పనులు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన బల్క్ డ్రగ్స్ పార్క్‌ను విశాఖపట్నం సమీపంలోని నక్కపల్లి వద్ద ఏర్పాటుకు ప్రభుత్వాలు అంగీకరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దీన్ని దాదాపు 2000 ఎకరాల విస్తీర్ణంలో 1876 కోట్ల తో దీన్ని నిర్మించనున్నారు. ఇది కేవలం ఔషధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఇది ప్రతిబింబం. ఈ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, దాని ప్రత్యేక విలువ, భారతీయ ఫార్మా పటంలో నక్కపల్లిని నిలపనున్నాయి. బల్క్‌డ్రగ్ పార్క్ అంటే చాలా మందికి ఒక పెద్ద ఫ్యాక్టరీ లేదా ఫార్మా సిటీలా అనిపిస్తుంది. కానీ దాని ప్రాముఖ్యత అంతకు మించి ఉంటుంది. అసలు మెడిసిన్ పని చేయడానికి గల ప్రధాన కారణం అందులో ఉండే బల్క్‌డ్రగ్ లేదా యాక్టివ్‌ఫార్మస్యూటికల్ ఇంగ్రిడియంట్. ఒక టాబ్లెట్‌లో మందు చాలా తక్కువ మోతాదులో ఉంటుంది కానీ ఆ టాబ్లెట్ ఆకారం, రుచి, అన్ని వాతావరణాలకు తట్టుకునేలా ఉండేందుకు మరికొన్ని పదార్థాలు కలుపుతారు. ఈ బల్క్‌డ్రగ్స్‌ను పెద్ద ఫ్యాక్టరీలలో రసాయనిక చర్యల ద్వారా తయారు చేస్తారు. వాటిని శుద్ధి చేసి, నాణ్యత పరీక్షించిన తర్వాతే, మందులు తయారు చేసే కంపెనీలకు పంపిస్తారు. ఈ కంపెనీలకు ఫార్ములేషన్ ప్లాంట్స్ అంటారు. ఈ ఫార్ములేషన్ ప్లాంట్స్‌లో ఈ బల్క్ డ్రగ్స్‌ను ఇతర పదార్థాలతో కలిపి టాబ్లెట్లు, సిరప్‌లు క్యాప్సూల్స్‌గా మారుస్తారు. ఈ బల్క్ డ్రగ్స్ లేకపోతే మెడిసిన్ తయారు చేయడం అసాధ్యం. అందుకే, ఈ కీలకమైన ముడి పదార్థాల ఉత్పత్తిని ఒకే చోట కేంద్రీకృతంచేసి, అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటు చేసేదే బల్క్ డ్రగ్ పార్క్. నక్కపల్లిలో ఈ భారీ ప్రాజెక్టును ఇప్పుడే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనే ప్రశ్న వస్తుంది. దీనికి ప్రధాన కారణం కోవిడ్. 2019లో కరోనా మహమ్మారికి ముందు వరకు, భారతదేశం తన బల్క్ డ్రగ్ అవసరాలలో అధిక భాగాన్ని చైనా నుంచి దిగుమతి చేసుకునేది. అయితే కోవిడ్ సమయంలో చైనా నుంచి దిగుమతులు పూర్తిగా తగ్గిపోవడం, సరఫరా చైన్ తెగిపోవడం వల్ల మనం దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ సంక్షోభమే తర్వాతే, మన దేశంలోనే ఎందుకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేయకూడదు అనే ఆలోచనకు భారత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పార్క్ నక్కపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో భాగం. ఇది విజయవాడ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో ఉంది. రాజయ్యపేట, బుచిరాజుపేట, చందనాడ, వెంపాడు, దోనివాని లక్ష్మీపురం గ్రామాల్లో విస్తరించి ఉంది. ఈ డ్రగ్స్ పార్క్ కోసం సౌత్ ఇండియాలో చాలా రాష్ట్రాల్లో తీవ్రంగా పోటీ పడ్డాయి. మొదట్లో ఈ పార్కును కాకినాడలో ఏర్పాటు చేయాలని భావించారు. నక్కపల్లి వద్ద భూమి సిద్ధంగా ఉందని అక్కడికి తరలించారు. నక్కపల్లిలో ఈ పార్క్ ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయి. రవాణా సౌకర్యం:- నేషల్ హైవేకు 16కు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. రైల్వే కనెక్టివిటీ కూడా ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎగుమతి దిగుమతులకు ఈ రైలవే లైన్ ఉపయోగపడుతుంది. పోర్టులు కూడా దగ్గరే:- గంగవరం పోర్టుకు చాలా దగ్గరగా ఉంది. విశాఖపట్నం పోర్టుకు 70 కిలోమీటర్లు, కాకినాడ పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటం దీనికి ఉన్న ప్రత్యేకత. వీటి కారణంగా ఉత్పత్తులు, ముడిసరకులు రవాణా మరింత సులభం అవుతుంది. విద్యుత్‌డ నీటి సౌకర్యాలు:- పారిశ్రామిక అవసరాల కోసం ప్రత్యేకమైన ఇండస్ట్రీయల్ పవర్ గ్రిడ్ ఉంది. భవిష్యత్‌లో పునరుత్పాదక ఇంధనం వనరులను కూడా దీనికి అనుసంధానం చేస్తారు. రసాయన పరిశ్రమలకు అత్యవసరమైన నీటి సరఫరా కోసం ఏలూరు కాలువ ఉండనే ఉంది. ఫార్మా ఎకో సిస్టమ్:- ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న హెటెరో దివిస్ ల్యాబ్స్, లాల్స్ ల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇవి ఈ బల్క్ డ్రగ్స్ పార్క్‌లో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నక్కపల్లి ప్రాజెక్ట్ ఖర్చు ?1,876.66 కోట్లుగా అంచనాలు వేస్తున్నారు. జనవరి 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ?1000 కోట్ల గ్రాంట్ అందిస్తోంది, మార్చి 2023లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ?225 కోట్లు విడుదల కూడా చేసింది. ఈ బీపీడీ మూడు ప్యాకేజీలుగా విభజించారు. వాటికి టెండర్లు పిలిచారు. వర్క్ నడుస్తున్నాయి. ప్యాకేజీ 1లో రోడ్లు, డ్రైన్లు, సరిహద్దు గోడలు, గ్రీన్ ఏరియా డెవలప్‌మెంట్, నీటి సరఫరా, రీసైకిల్ వాటర్ సరఫరా, వేస్ట్ వాటర్ సిస్టమ్, పవర్ సప్లై, ఎమర్జెన్సీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ట్రక్ టెర్మినల్స్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి పనులు ఉంటాయి. ప్యాకేజీ 2లో కామన్ ఎఫ్లియెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్, మోరిన్ అవుట్‌ఫాల్ సిస్టమ్ ఈ పనులు వ్యర్థ జలాలు శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా చూస్తారు. ప్యాకేజీ 3లో స్టీమ్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, కామన్ సాల్వెంట్ రికవరీ సిస్టమ్ పనులు పూర్తి చేస్తారు. శరవేగంగా పనులు ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎనహెచ్ 16 నుంచి ఎన్ఐఏకు 4.5 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. పార్క్ కోసం సేకరించిన రెండు వేల ఎకరాల భూమి మొత్తం ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. భవిష్యత్ విస్తరణ కోసం అదనంగా 723.2 ఎకరాలు కేటాయించారు. ఇందులో పరిశ్రమలకు 1900 ఎకరాలను కేటాయిస్తారు. సౌకర్యాల కోసం 70 ఎకరాలు ఇస్తారు. పార్కింగ్, లాజిస్టిక్ అవసరాల కోసం 120 ఎకరాలు, మిగిలిన భూమిని యుటిలిటీలు, ఓపెన్ స్పేస్, వాటర్ బాడీ, గ్రీన్ బెల్ట్, రోడ్ల కోసం కేటాయిస్తారు. మొత్తం సేకరించిన భూమిలో కేవలం 57.90 శాతం విక్రయించడానికి వీలుగా ఉంటే మిగిలిన ప్రాంతాన్ని యుటిలీలు, ఓపెన్ స్పేస్, రోడ్లకు కేటాయిస్తారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందించి ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పెట్టుబడిదారులు కోర్ ఉత్పత్తిపై దృష్టి పెడతారు. ఇది పెట్టుబడి, ఆపరేటింగ్ ఖర్చును 15-20 శాతం వరకు తగ్గిస్తుంది.

# వైసీపీ నేతల మధ్య గ్యాప్



విజయవాడ, అక్టోబరు 27 వైసీపీ అధినేత జగన్ కు పార్టీల నేతల మధ్య గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తుంది. వారి మధ్య సరైన అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. విశాఖ గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఈ విషయం మరొకసారి స్పష్టమయింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అవగాహన ఒప్పందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుదుర్చుకున్నారు. కానీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే వైసీపీ ఉత్తరాంధ్ర నేతలు మండిపడ్డారు. డేటా సెంటర్ తో ఉపయోగాలు లేవని, పర్యావరణానికి ముప్పు అని వైసీపీ నేతలు ప్రకటించారు. అదే సమయంలో నీరు,విద్యుత్తు అధికంగా వినియోగమవుతుందని చెప్పుకొచ్చారు.. అయితే వైఎస్ జగన్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో గూగుల్ డేటా సెంటర్ వల్ల ఉపయోగాలను పూసగుచ్చినట్లు చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల భవిష్యత్ లో అనేక ఉపయోగాలున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ వ్యాలీకి ఈ డేటా సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని జగన్ చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్ వల్ల వచ్చే ఉపాధి అవకాశాలు తక్కువని అన్నారు. భవిష్యత్ లో జరిగే మార్పునకు డేటా సెంటర్ ముఖ్య భూమిక అని జగన్ అన్నారు. రిక్రియేషన్ సెంటర్, ఐటీ పార్క్, స్కిల్ సెంటర్ పెట్టాలని నాడు అదానీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని జగన్ తెలిపారు. దీంతో వైసీపీ నేతలు డేటా సెంటర్ పై ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గాలిలో తేలిపోయినట్లయింది. డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటనను ప్రభుత్వం చేసిన వెంటనే హడావిడిగా వచ్చిన వైసీపీ నేతలు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టడమే పనిగా పెట్టుకున్నారు. అంతే తప్ప దాని వల్ల ఉపయోగాలను గురించి కనీసం ఆరా తీసే ప్రయత్నం చేయలేదు. గత ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాథ్ సయితం విమర్శలకు దిగారు. బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నేతలు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. డేటా సెంటర్ ను అమరావతిలో పెట్టుకోవచ్చు కదా? అని కూడా ప్రశ్నించారు. జగన్ విదేశాల నుంచి వచ్చి వైసీపీ నేతల ఆరోపణలకు విలువ లేకుండా చేశారు. దీంతో వైసీపీ అధినేతకు, నేతలకు మధ్య గ్యాప్ ఉందన్న విషయం మరోసారి బయటపడింది.

# ఎర్రగడ్డ డివిజన్ లో మంత్రి జూపల్లి ఇంటింటి ప్రచారం

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్ లో సోమవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కళ్యాణ్ నగర్, హైమవతి నగర్ లో వాకర్స్ మీట్ లో పాల్గొన్నారు. స్థానికులతో కలిసి అల్పాహారం చేశారు. రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర, ఇంటింటి ప్రచారం చేస్తూ.. ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వెళ్లి వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను, ఆరోపణలను తిప్పికొడుతూ.. ప్రజలకు వివరించారు. ప్రజలను ఎక్కడికక్కడ పలకరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ఆయన చేపట్టిన ఇంటింటికీ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఏ కాలనీకి వెళ్లినా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ధనిక రాష్ట్రంగా ఉందని, కానీ కేసీఆర్ హాయంలో రూ. 8లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ధ్వజమెత్తారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అప్పులు చేసిన రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు సంవత్సరానికి సుమారు రూ. 1.40 కోట్ల అప్పులు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు వివరించారు.

# బీహార్ లో ప్రచారానికి చంద్రబాబు, పవన్

విజయవాడ, అక్టోబరు 27, దేశంలో విచిత్ర రాజకీయ పరిస్థితి నడుస్తోంది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని అయ్యారు నరేంద్ర మోడీ. అయితే అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయంగా పోరాటం చేస్తోంది. చిన్న అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. అందుకే అక్కడ చెమటోడ్చుతుంది ఎన్డీఏ. అక్కడ గెలుపు ఏమంత సులువు కాదు కూడా. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఒక విధంగా చెప్పాలంటే బీహార్ ఎన్నికల వరకు ఒక ఎత్తు. దాని ఫలితాలు మరో ఎత్తు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలు తక్కువ. అదే ఇండియా కూటమిలో అయితే జాతీయస్థాయిలో చాలామంది నేతలు ఉన్నారు. ఇండియా కూటమి తరుపున ప్రచారం చేసేందుకు చాలామంది నేతలు క్యూ కడుతున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ గట్టి వ్యూహాలు రూపొందిస్తున్నారు. జాతీయస్థాయిలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా కేంద్ర రాజకీయాల్లో సుపరిచితుడు చంద్రబాబు. ఆపై మంచి పాలనా దక్షుడు అన్న పేరు తెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉంది. అందుకే బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చంద్రబాబును బిజెపి పెద్దలతో పాటు నితీష్ కుమార్ ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో ప్రచారం చేశారు చంద్రబాబు. అక్కడ తెలుగువారితో పాటు జాతీయస్థాయిలో చంద్రబాబు ప్రభావం చూపడంతో ఎన్డీఏ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణంతో తిరిగి వచ్చేసారు. ఇప్పుడు బీహార్ ప్రచారానికి వెళ్తున్నట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. పవన్ కళ్యాణ్ సైతం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. గతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. సనాతన ధర్మం, హిందూ పరిరక్షణ విషయంలో పవన్ చర్యలను జాతీయస్థాయిలో హిందూ వాదులు గట్టిగానే సమర్థించారు. బీహార్లో సైతం పవన్ ప్రచారం చేస్తే హిందువులు గుంప గుత్తిగా ఎన్డీఏకు ఓటు వేస్తారని బిజెపి పెద్దల ఆలోచన. అయితే బిజెపి విషయంలో పవన్ ఎప్పుడు సానుకూలంగానే ఉంటారు. తప్పకుండా బిజెపి వినతిని పరిగణలోకి తీసుకొని బీహార్ ప్రచారంలోకి వెళ్తారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం బిజీగా ఉంది.

# పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు...

## తప్పిన పెనుప్రమాదం




ఒంగోలుప్రకాశం జిల్లా మార్కాపురం ? కుంట మధ్య ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నుంచి తప్పించుకుంది. మార్కాపురం నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు కొట్టాలపల్లి గ్రామ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రయాణికులు ఆందోళనకు గురైయారు. డ్రైవర్ సకాలంలో బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి - కలెక్టర్ హెచ్చరిక--

## మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీ వర్షాలు--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-"మొంథా" తుఫాను ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు.రైతులు తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఉల్లి, మొక్కజొన్న, టమోటా పంటల కోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. అధిక తేమ కారణంగా పంటలకు తక్కువ ధరలు పడే అవకాశం ఉందని, వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని ఆమె ఆదేశించారు.పారిశుద్ధ్యంపై ఆత్మకూరు మున్సిపాలిటీ నిర్లక్ష్యం చూపుతోందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందేలా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, ఆర్‌ఓ ప్లాంట్లలో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని సూచించారు.వర్షాల కారణంగా ప్రమాదావస్థలో ఉన్న మట్టి మిద్దెల ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చెరువులు, కాలువల వద్ద గండిపడిన ప్రాంతాలను ముందుగా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.రైతులు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తిచేయాలని, ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంపుల్లో పాల్గొని తమ వివరాలు సరిచేయాలని కలెక్టర్ తెలిపారు.

# తుఫాను ముంచుకొస్తుంది పట్టణ వాసులు జాగ్రత్త కమిషనర్--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-:'మొంత' తుఫాన్‌కు సంబంధించి వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో నంద్యాల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల పురపాలక సంఘ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.పట్టణంలో సోమవారం అర్ధరాత్రి (27వ తేదీ) నుండి 29వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం కారణంగా విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు ముందస్తుగా నీటిని సమృద్ధిగా నిల్వ చేసుకుని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.అలాగే, ఎలాంటి అత్యవసర సమస్యలు తలెత్తినపుడు నంద్యాల మునిసిపల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 7702776048 ను సంప్రదించాలని కోరారు.ప్రజల భద్రత, సౌకర్యం దృష్ట్యా పురపాలక సంస్థ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కమిషనర్ తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు ప్రజలు అవసరం లేని పయనాలు చేయకుండా, ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# బస్సులపై రవాణా శాఖ భారీ డ్రైవ్--

## నిబంధనలు ఉల్లంఘించిన బస్సులపై చర్యలు

## 24 కేసులు నమోదు--రూ.1.45 లక్షల జరిమానా

## ఒక బస్సును సీజ్ చేసిన డిటిఓ శివారెడ్డి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-నంద్యాల జిల్లాలోని ఆర్టీసీతోపాటు ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా నంద్యాల జిల్లా పరిధిలో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన జిల్లా రవాణా శాఖ అధికారులు 24 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో బస్సులు అనుమతించిన మార్గాలకు విరుద్ధంగా నడపడం, ఫిట్నెస్ సర్టిఫికేట్ గడువు ముగియడం, సాంకేతిక లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి కారణాలతో దాదాపు రూ. 1.45 లక్షల జరిమానాలు విధించామని డిటిఓ శివారెడ్డి తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతే ప్రాధాన్యం కాబట్టి ఎలాంటి నిబంధనల ఉల్లంఘనను సహించబోమని అన్నారు.

# మెప్మాలో అవినీతి జాలం--

## లోన్‌కు లంచం.. అధికారుల వాటాల రాజ్యం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-నంద్యాల జిల్లా మెప్మా విభాగంలో అవినీతి ముళ్లు బిగుస్తున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు తమ ఇష్టానుసార పాలన సాగిస్తున్నారు. పేద మహిళల పొదుపు నిధులను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మహిళా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. లోన్ శాంక్షన్ కావాలంటే "లక్షకు వెయ్యి రూపాయలు తప్పనిసరి" అంటున్నారట. నిబంధనలు అడిగితే వారివారి గ్రూప్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించి, బ్యాంక్ లోన్‌లను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కూడా సరైన లబ్ధిదారులకు చేరకముందే మాయమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.బుక్ కీపర్లు, సీఆర్పీలు, సీఓలు, సీఎంఎంల వరకు వాటాలు పంచుకునే అవినీతి వ్యవస్థ కొనసాగుతోందని మహిళలు తెలిపారు. ప్రతి స్థాయి అధికారికి వాటా కేటాయింపే నియమంగా మారిందని, మెప్మా వ్యవస్థ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని వారు మండిపడ్డారు.ఇదే పరిస్థితి గతంలోనూ కనిపించిందని, కడప పీడీ ఇన్‌ఛార్జ్‌గా నంద్యాల జిల్లా బాధ్యతలు చేపట్టిన రోజులలో మెప్మాలో అవినీతి రాజ్యమేలిందని మహిళా సంఘాలు గుర్తుచేస్తున్నాయి. అప్పుడు కూడా అధికారుల ఇష్టానుసార వ్యవహారాలు, లంచాల బంధాలు, లోన్ మాఫియాలు విస్తరించాయని వారు చెబుతున్నారు.తాజా ఫిర్యాదులపై విచారణ జరిపి ఇద్దరు సీఓలను సస్పెండ్ చేయగా, ఇద్దరు సీఆర్పీలను ఇంటికి పంపించారు .ఇప్పుడే బాధ్యతలు స్వీకరించిన పీడీ వెంకటదాస్ ఈ అవినీతి గూటిని ధ్వంసం చేసి పారదర్శక పాలనకు మార్గం సుగమం చేస్తారా లేదా అనే ప్రశ్న ఇప్పుడు నంద్యాల ప్రజల నోళ్లలో వినిపిస్తోంది."వెంకటదాస్ అవినీతి జాలాన్ని ఛేదిస్తారా... లేక పాత పద్ధతులే కొనసాగుతాయా?" అన్న ఉత్కంఠ జిల్లాలో నెలకొంది.మెప్మా వ్యవస్థలో శుద్ధి అవసరమని ప్రజలు, మహిళా సంఘాలు గళమెత్తుతున్నాయి. కొత్త పీడీ చర్యలు మెప్మా భవిష్యత్తు దిశను నిర్ణయించనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి--

## రీ ఓపెన్ దరఖాస్తులు వెంటనే క్లియర్ చేయాలని ఆదేశం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత కాలపరిమితిలో సత్వర పరిష్కారం చేయాలని ఆమె స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు కలిసి అర్జీల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు వారాల్లో 481 రీ ఓపెన్ దరఖాస్తులు ఉన్నాయని, ముఖ్యంగా రెవెన్యూ, సర్వే విభాగాల్లో అధికంగా ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని తాసిల్దార్లు, ఆర్డిఓలు కు ఆదేశాలు జారీ చేశారు.ఫీడ్బ్యాక్ స్వీకరణ రేటు 39 శాతం మాత్రమే ఉన్నందున దాన్ని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే గడువు ముగిసేలోపు పరిష్కరించాల్సిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న ఆడిట్‌లను కూడా వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మొత్తం 282 మంది ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోపు క్లియర్ చేయాలని సంబంధిత అధికారులకు డిఆర్ఓ ఎండార్స్‌మెంట్లు జారీ చేశారు.పిజిఆర్ఎస్‌లో వచ్చిన కొన్ని ప్రధాన అర్జీలు ప్యాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన పి. సుగణ భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరుకు మారిందని దానిపై న్యాయం. పగిడ్యాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎస్. నరసరావు శ్రీశైలం ప్రాజెక్టు కోసం భూమి స్వాధీనం చేయడంతో ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి. ఆళ్లగడ్డ మండలం పాపంపల్లికి చెందిన బి. మోహన్ రెడ్డి భూమి వివరాలు ఆన్లైన్‌లో తగ్గించబడ్డాయని మిగతా భాగం చేర్చాలని దరఖాస్తు.కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు అన్ని అర్జీలను పూర్తి నాణ్యతతో ప్రజలు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించేలా చర్యలు ప్రారంభించారు




# ప్రజా శ్రేయస్సు కొరకు విశ్వశాంతి మహాయుగ మహోత్సవం.

విభారే న్యూస్ అక్టోబర్ 27 ఎమ్మిగనూరు..పంచభూతాలు – మన శరీరం.పంచభూతాలు (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం) సృష్టి మరియు మానవ శరీరానికి మూలభూతమైన నిర్మాణ ఘటకాలు.ఇవి సమతుల్యంగా ఉన్నప్పుడు ఆరోగ్యం, శ్రేయస్సు స్థిరంగా నిలుస్తాయి.ఒక మనిషి జీవితంలోని నాణ్యత ఈ పంచ భూతాలు శరీరంలో ఎంత సమన్వయంగా, సమతుల్యంగా ఉన్నాయనే దానిపై ఆధారపడి ఉంటుంది.ఈ పంచభూతాలు సమతుల్యంలో, పరస్పరం సహకారంగా ఉన్నప్పుడు, మనిషి అపారమైన సౌఖ్యం స్థిరత్వాన్ని అనుభవిస్తాడు.ఈ పంచ భూతాలను నియంత్రించడం ద్వారా శరీరం, మనస్సుపై పూర్ణ ఆధిపత్యం పొందవచ్చు.దీనివల్ల జీవనంలోని అన్ని అంశాలు, ఆరోగ్యాన్ని సహా, సమతుల్యంగా, సమృద్ధిగా నిలుస్తాయి.మన జరిగే 87 వ విశ్వశాంతి యాగంలో పాల్గొనడం వల్ల మనందరం ఈ పంచభూతాలలోని దోషాలను తొలగించుకొని శ్రేయస్కరమైన జీవితాన్ని మలుచుకుందామని తెలియజేయడమైనది.




# పోలీస్ అమరవీరుల స్మరణలో ఓపెన్ హౌస్ ప్రారంభం--

## ఎస్పీ సునీల్ షెరాన్ చేతుల మీదుగా కార్యక్రమం ఆరంభం--

## పోలీస్ జాగిలం హనీ విన్యాసాలు అబ్బురపరిచాయి--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నంద్యాల పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎస్పీ గారికి పోలీన్ జాగిలం హనీ గౌరవ వందనం ఇచ్చింది.విద్యార్థులకు పోలీసులు వాడే ఆయుధాలు, పరికరాలు, సాంకేతిక సాధనాలపై వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ? "పోలీసుల త్యాగాలు స్ఫూర్తిదాయకం. విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి. సమాజ భద్రతలో అందరూ పోలీస్ శాఖకు తోడ్పడాలి" అని అన్నారు.ప్రదర్శనలో ఏకే ?47, ఎస్ ఎల్ ఆర్ , మస్కెట్, పిస్టల్, గ్యాస్ గన్, మెటల్ డిటెక్టర్లు, వైర్‌లెస్ పరికరాలు వంటి ఆధునిక ఆయుధాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.మహిళా ఇన్స్పెక్టర్లు గౌతమి, జయరాం విద్యార్థులకు శక్తి యాప్, సైబర్ భద్రత పై అవగాహన కల్పించారు.పోలీస్ జాగిలం హనీ పేలుడు పదార్థాల గుర్తింపు విన్యాసాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఆరైలు లు, ఆర్ ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో మెగా రక్తదాన శిబిరం--

## ప్రజలతో కలిసి డీఎస్పీ ప్రమోద్ రక్తదానం--

## అమరవీరుల స్ఫూర్తిగా 106 మంది రక్తదానం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ గారి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డీఎస్పీ కె. ప్రమోద్ గారి ఆధ్వర్యంలో సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో "మెగా రక్తదాన శిబిరం"ను విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముందుగా డీఎస్పీ ప్రమోద్ స్వయంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. అనంతరం సీఐ యుగంధర్ , ఎస్సైలు, పోలీసులు, యువత మరియు ఇతర ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.మొత్తం 106 మంది రక్తదానం చేశారు. అందులో పోలీసు సిబ్బంది 27 మంది, యువత మరియు ప్రజలు 79 మంది ఉన్నారు.ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన స్టేట్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బందికి, ప్రజలకు, మరియు సబ్ డివిజన్ పోలీసు సిబ్బందికి డీఎస్పీ ప్రమోద్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ ముందడుగు--

## 140 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సునీల్ షెరాన్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 27-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ప్రజల నుంచి మొత్తం 140 ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ? ప్రజల సమస్యలను చట్టపరంగా, న్యాయంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులకు సూచించారు.స్వీకరించిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, పొలం తగాదాలు, ఆస్తి వివాదాలు వంటి అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**